ప్రజాశక్తి

శనివారం 24 ఆగస్టు 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆగని ఫార్మా ప్రమాదాలు

- ఎసెన్షియా ఘోరం మరువకముందే సినర్జిన్‌లో ఘటన
- బయటపడుతున్న ఫార్మా యాజమాన్యాల నిర్లక్ష్యం

సినర్జిన్ ఫార్మా ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ఇండస్‌లో చికిత్స పొందుతున్న సినర్జిన్ ప్రమాద బాధితులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు పాటించకపోవడంవల్లే ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇంతవరకు చేసిన వాదనలు నిజమవుతున్నాయి. భద్రత పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రమాదం జరిగిన ప్రతి సందర్భంలోనూ కార్మిక సంఘాలు చెబుతున్న మాటలు అక్షర సత్యాలుగా నిలుస్తున్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఈ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తరువాత మీడియా సమావేశంలో యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయినా యాజమాన్యంపై కేసు నమోదుచేయడానికి ప్రభుత్వం ఇష్టపడలేదు. యాజమాన్యాన్ని రక్షించేందుకు ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పడం 17 మందిని తన నిర్లక్ష్యం వల్ల బలితీసుకున్న యాజమాన్యాన్ని రక్షించడానికేనని అర్థమవుతోంది.

అసెన్షియా ప్రమాదంపై చర్చ జరుగుతుండగానే పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ కంపెనీలో గురువారం రాత్రి మిగతా 2లో..

సినర్జిన్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, సిఐటియు

అనకాపల్లి : పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని, కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావులతో కలిసి శుక్రవారం ఘటనా స్థలాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..

అనకాపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న వైసిపి అధినేత జగన్

ప్రభుత్వ స్పందన సరిగా లేదు : జగన్

వార్తలు 5లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టండి

సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

పోర్టు సమ్మెను జయప్రదం చేయండి

వార్త 8లో..

భయం వీడితే విజయం మీదే..

వార్త 2లో..

నేడు కళాభారతి వార్షికోత్సవం

వార్త 2లో..

ఉపమాకలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

సమగ్రాభివృద్ధికి పెద్దపీట

గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు ఉద్ఘాటన

వార్తలు 7లో..

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి సంబంధించి పోర్టు స్టేడియంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజుకు సుమారు 500 నుంచి 800 వరకు అభ్యర్థులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే డైమండ్ జూబ్లీ మైదానంలో బ్యారికేడింగ్, విద్యుత్ దీపాలు, సీసీ టీవీల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు, ఎంపిక ప్రక్రియలో రిజిస్ట్రేషన్, పత్రాల స్కీనింగ్, ఇతర అంశాల పర్యవేక్షణకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది ఉండేందుకు అనువుగా వసతి ఏర్పాట్లు, మైదానం వెలుపుల అభ్యర్థులు క్యూలైన్లలో వచ్చేందుకు వీలుగా బారికేడ్లు సిద్ధం చేశారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ ఇతర పనులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. పనులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు సంబంధిత మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు.

సెంటు భూమి కూడా ఆక్రమణ కారాదు

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని దేవాదాయ శాఖ, ప్రభుత్వ భూముల్లోని ఒక సెంటు భూమి కూడా ఆక్రమణ కావడానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు తేల్చిచెప్పారు. అలా జరిగితే చూస్తూ ఊరుకోబోమని, దాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులందరూ జాగ్రత్తగా పనిచేయాలని హెచ్చరించారు. అధికారులకు తెలియకుండా భూ ఆక్రమణలు జరగబోవని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భూ పరిరక్షణ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, దేవాదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణ కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. జిల్లాలో చాలా విలువైన భూములు ఉన్నాయని, అవి ఆక్రమణలు జరిగాయని చెప్పారు. ఇకపై ఎటువంటి భూఆక్రమణలు జరగకుండా కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దేవాదాయ శాఖ భూములను గుర్తించి, వాటికి సరిహద్దులను నిర్ణయించడం అధికారుల తక్షణ కర్తవ్యమన్నారు. గుర్తించిన భూములకు ప్రహరీ గోడలు నిర్మించి, అవి ఆక్రమణ కాకుండా ప్రతి రోజూ పర్యవేక్షిస్తూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆగని ఫార్మా ప్రమాదాలు

జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రియాక్టర్‌లో కెమికల్ ఛార్జ్ చేస్తున్నప్పుడు మ్యాన్‌హోల్ నుంచి కెమికల్ లీకవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడ కూడా యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వాస్తవానికి ప్రమాద సంకేతాలను తెలియజేసే సెన్సార్ వ్యవస్థ కంపెనీల్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదం ఏర్పడి, తప్పించుకొనే అవకాశంలేక కార్మికులు మృతిచెందడం, గాయపడ్డం జరుగుతోంది. ఎసెన్షియా ఫార్మాలో వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్‌ను కారణంగా అధికారులు తేల్చారు. ఈ కంపెనీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ముందుగా తెలియజేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. సాల్వెంట్ ప్రక్రియలో లీకవడంతో రియాక్టర్ పేలి పెద్ద ప్రమాదానికి దారితీసింది. సేఫ్టీ ఆడిట్ సరిగా యాజమాన్యం నిర్వహించకపోవడం, లోపాలను సరిచేయకపోవడం, భద్రతకు డబ్బులు ఖర్చు పెట్టడానికి ఆసక్తి చూపకపోవడంతో కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలు పోయి, వారి కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఫార్మా కంపెనీల్లో ప్రమాదం జరిగిన ప్రతిసారి యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనబడినా సరిచేసే ప్రయత్నం ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చేయకపోవడంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి.

సినర్జిన్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

ఎసెన్షియా ఫార్మా ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే పరావాడ ఫార్మాలో మరో ప్రమాదం జరిగిందంటే కంపెనీ యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతుందన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా వుండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాలు జరిగిన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని వుంటే నేడు ఇలాంటి ప్రమాదాలు మరలా సంభవించేవి కాదన్నారు.

సినర్జిన్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావులు ఒక ప్రకటన విడుదల చేశారు.

సెంటు భూమి కూడా ఆక్రమణ కారాదు

వుండాలన్నారు. కాలపరిమితిని నిర్ణయించుకొని, ఆలోగా ఈ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములకు సర్వే చేయించి నోటీసులు జారీ చేయాలని, ఆక్రమణల తొలగింపుల్లో రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కె.శిరీష మాట్లాడుతూ జిల్లాలోని 11 దేవాలయాలకు చెందిన భూములు ఆక్రమణలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని అన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, పలు దేవాలయాల ఇఒలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రిజిస్ట్రార్, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు కళాభారతి వార్షికోత్సవం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 37 సంవత్సరాలుగా కళాకారులను, కళలను ప్రోత్సహిస్తూ, వారికి సహాయ సహకారాలు అందిస్తున్న విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నామని కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం ఉదయం కళాభారతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత క్లారినెట్ విద్వాంసులు ఎకెసి.నటరాజన్‌కు 'నాద విద్యా భారతి' బిరుదుతోపాటు లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం, స్వర్ణకమలాన్ని శనివారం సాయంత్రం అందిస్తున్నామని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, తూర్పు నావికాదళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ హాజరవుతారని వెల్లడించారు. గౌరవ కార్యదర్శి గుమ్మలూరు రాంబాబు మాట్లాడుతూ ఆరు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ప్రవేశం ఉచితమని, ప్రజలంతా హాజరై వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో పైడా కృష్ణ ప్రసాద్, మల్లికా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వి పొంతన లేని మాటలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మాటలకు, చేతలకు చాలా తేడా ఉంటుందని, ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఉండదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పార్క్ హోటల్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చాలా ఫార్మా ప్రమాదాలు జరిగాయని, అప్పుడు జగన్ పరామర్శకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాద ఘటనపై వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. జగన్ ఫార్మా ప్రమాదాలపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు.

భయం వీడితే విజయం మీదే..

మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి అనిత

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహిళలు వ్యాపార రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే వారిలోని భయాలను విడిచి పెట్టాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌లో మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు జరిగింది. సిఐఐ పిఎస్‌యు కనెక్ట్ - 2024 పేరిట ఎపి చాంబర్స్ ఉమెన్ ఎంటర్‌పెన్యూర్ వింగ్, ఎఎల్ఇఎపి, విసిఐ ఉమెన్ వింగ్, వాస్సివా సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సందర్భాలలో లింగ వివక్షతతో వక్రీకరించబడుతున్నారని తెలిపారు. దీనిని రూపుమాపేందుకు సమసమాజాన్ని పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను పాఠశాల ఉపాధ్యాయిని స్థాయి నుంచి రాష్ట్ర హోం మంత్రి స్థాయికి ఎదిగిన ప్రస్థానాన్ని వివరిస్తూ రాత్రికి రాత్రే విజయం సాధించలేదని, అవిశ్రాంత కృషి, నిర్భయ వైఖరి కారణంగా తాను ఈ విజయం సాధించానని అన్నారు. మహిళల నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలకు ఆర్థిక సంస్థలు మద్దతు ఇవ్వాలని కోరారు. మరొక ముఖ్య అతిథి మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్ చైర్‌పర్సన్ మహిళలు వినియోగదారులు ఉపయోగించే ఉత్పత్తులను ఎంచుకోవడం ద్వారా వ్యాపారంలో 70 శాతం విజయం సాధించవచ్చునని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాధికారతపై మహిళలు దృష్టి సారించాలన్నారు. పలు రంగాలలో మహిళలు నాయకత్వ స్థానాన్ని ఆక్రమించినప్పటికీ పలు జిబిఎం.రత్నకుమారి మాట్లాడుతూ మహిళలు వ్యాపారాన్ని ఓపిగ్గా నిర్వహించాలని అన్నారు. అనంతరం హెచ్‌సిఎల్, హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్స్, ఎన్‌టిపిసి, తదితర సంస్థల ప్రతినిధులు డెవలప్‌మెంట్ అవకాశాలపై ప్రసంగించారు.

కార్యక్రమంలో సిఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ జి.మురళీకృష్ణ, సిఐఐ విశాఖపట్నం అధ్యక్షులు గ్రంధి రాజేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం సర్కిల్ డిజిఎం పంకజ్ కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి వనరులకు పూర్వ వైభవం తీసుకురావాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని సహజ తాగునీటి వనరుల సంరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి పటిష్ట చర్యలు చేపట్టాలని, వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ విభాగాలను ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి వనరుల సంరక్షణ, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి శుక్రవారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహించారు. జల వనరుల పునరుద్ధరణ, సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సహజ సిద్ధ తాగునీటి వనరుల సంరక్షణలో ధాన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకోవాలని, స్థానిక ప్రజల భాగస్వామ్యం తీసుకొని ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, డ్వామా పీడీ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

సైబర్ సెక్యూరిటీపై పోర్టులో అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా విశాఖ పోర్టు పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల పాటు అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాగరూకత, అవగాహన, భద్రత థీమ్‌తో దీన్ని చేపట్టారు. పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే ముఖ్య అతిథిగా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పిఎస్ఎల్.స్వామి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P. 73/2024 in O.S.736/2012

Between:
Sri Nandamudi Syam Sundar Rao ...D.Hr/Plaintiff
And:
Sri Kantimahanthu Roop Anil Kumar ...J.Dr/Defendant

NOTICE UNDER ORDER 21 RULE 22 OF CPC

To,
J.Dr/Defendant:
Sri Kantimahanthu Roop Anil Kumar
S/o. Gopala Rao, Hindu, aged 58 years, Retd. Assistant, PEM002352, FA & CAO, Visakhapatnam Port Authority, R/at Flat No.203, Sampath Arcade, Narasimhanagar, Visakhapatnam-16.

Please take notice that the above named D.Hr/plaintiff has instituted the above E.P against you and the matter stands posted to **03-09-2024** for your appearance. You are hereby required to appear in the above court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above E.P on **03-09-2024** at **10:30 A.M.** In default of your appearance on that day the E.P will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
D. SRINIVAS & CH. SATYA HARI,
Advocates
Visakhapatnam,
Cell: 9985193366.

In the Court of the Principal Junior Civil Judge at Kakinada
O.S. No. 846/2022

Between:
Allu Vigneswara Rao ***...Plaintiff***
AND
Yalamanchili Suri Eswara Rao ***...Defendant***

To:
Yalamanchili Suri Eswara Rao, S/o. Suribabu, aged 45 years, Business, Saripallivaripalem, Nakkapalli Mandalam, Anakapalli District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు దావా సమన్లు పంపిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-9-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
డి.సుబ్రహ్మణ్యం
వి.వి.ఎస్.ఎల్.కిరణ్
ఎం.ధనుంజయరావు, అడ్వకేట్స్
సుభద్రా ఆర్కేడ్, కాకినాడ
సెల్: 9849715132

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) BHEEMUNIPATNAM
O.S. 49 / 2024

Between:
Chukkapalli (Thariguppala) Subbalakshmi and others . . . Plaintiffs
And:
Valmiki Vikrant and others . . . Defendants

NOTICE

To
1. Valmiki Vikrant, S/o. Rajkumar, aged 31 years, Hindu, Flat No.1, Palm Apartments, Plot No.62, Kirlampudi Layout, Visakhapatnam-530 017.
2. Chukkapalli Venkateswara Rao, S/o. Chukkapalli Kasi Viswanadham, aged 52 years, D.No. 43-34-2, Railway New Colony, Subba Lakshminagar, Visakhapatnam - 530 016.
3. Chukkapalli Subbalakshmi, D/o. Chukkapalli Kasi Viswanadham, aged 47 years, D.No. 43-34-2, Railway New Colony, Subba Lakshminagar, Visakhapatnam - 530 016.

Please take notice that the above suit/matter/case was filed by the plaintiffs against you. The above Honourable Court ordered notice for your appearance on **13-09-2024 at 10-30 A.M.** before the said court and if you failed to appear, the matter will be heard and decided in your absence.

CH.VENKATESWARA RAO
CH.V.S.N.MURTHY &
CH.SAI JAISHANKAR
Advocates, Plot No. D-19, Chunduru Street, Vuda Layout, Kapuluppada - 531 163.
Bheemunipatnam Mandal, Visakhapatnam District.
Cell : 9849331663, 9885182515 & 9866271545

జనరల్ నోటీసు

నా క్లయింటు అయినటువంటి బొండా రామోజీ, తండ్రి ముసిలి, రామ్‌నగర్ వీధి, యలమంచిలి గ్రామం, అనకాపల్లి జిల్లా, నాకు ఇచ్చిన భోగట్టాపై నేను ఇచ్చుచున్న జనరల్ నోటీసు అంశములు.

ఇందుమూలంగా యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా యలమంచిలి మండలం, యర్రవరం గ్రామం తాలూకు సర్వేనెం. 191లో య. 0.33ట్లు వెట్టు భూమి రిజిష్టర్డు క్రయదస్తావేజు తేది: 22-06-2022ని దస్తావేజు నెం.5893 (2022) ద్వారా నా క్లయింటుకు దాఖలుపడి, నా క్లయింటు స్వాధీన అనుభవములోయున్నది. సదరు భూమికి రెవెన్యూవారు నా క్లయింటు పేరిట పట్టాదారు పాసుపుస్తకములు మంజూరు చేసి, రెవెన్యూ రికార్డులలో అనగా 1.బి, అడంగలులో నా క్లయింటు పేరు నమోదు చేసియున్నారు. నా క్లయింటు జనవరి 2024లో తన అవుసరం నిమిత్తం రూ. 10,00,000లు అవసరం పడి యలమంచిలి మండలం, రేగుపాలెం గ్రామం వాస్తవ్యులు మర్రి కనకదుర్గాదేవి, తండ్రి స్వామినాయుడు అను ఆసామి మరియు యలమంచిలి, ద్వారకానగర్ వాస్తవ్యుడు ముమ్మిన సత్యంరాజు, తండ్రి వీర్రాజు అను ఆసామిని ఇరువురను వడ్డీ నిమిత్తం అప్పు అడిగియున్నారు. నా క్లయింటు అవుసరం అసరాగా తీసుకుని సదరు అసాములు నా క్లయింటుపేరున ఉన్న పై భూమిని జి.పి.కమ్ సేల్ దస్తావేజు వ్రాయమని అలా అయితేనే అప్పు ఇస్తామని కండిషన్ పెట్టినారు. నా క్లయింటు ఆపరిస్థితులులో దానికి ఒప్పుకుని అప్పు తీసుకునియున్నారు. దరిమిలా తేది: 24-01-2024ని పై ఆసాములు నా క్లయింటును యలమంచిలి సబ్‌రిజిస్ట్రారును వారి ఆఫీసకు రమ్మని వారు చెప్పిన దస్తావేజు పై నా క్లయింటుచే సంతకములు చేయించు కునియున్నారు. అవుసరంలో నా క్లయింటు వారికి జి.పి.కమ్ సేల్ దస్తావేజు వ్రాసియున్నాడు. వారు నా క్లయింటు అప్పు తీర్చివేయగానే సదరు జి.పి.కమ్ సేల్ దస్తావేజుకు రద్దు చేసి ఇస్తామని హామీ ఇచ్చియున్నారు. ఈ మధ్యన నా క్లయింటు అప్పు చేసిన సొమ్ము వడ్డీతో సహా సిద్ధం చేసుకుని పై ఆసాములను అప్పు తిరిగి తీర్చివేస్తానని తను వ్రాసిన జి.పి.కమ్ సేల్ దస్తావేజును రద్దుచేయమని అడుగగా పై ఆ సాములు అందుకు అంగీకరించకుండా భూమి తమదని, దస్తావేజు రద్దు చేయమని సదరు భూమిని వారు వేరొకరికి అమ్మివేస్తామని నా క్లయింటుపై తిరగబడియున్నారు. నా క్లయింటు వెంటనే మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో పై జి.పి.కమ్ సేల్ దస్తావేజును రద్దు చేయించమని దావా జి.ఆర్.నెం. 3632 (20-08-2024)పై ఆసాములపై కేసు వేసుకునియున్నాడు. సదరు కేసు పెండింగు లోనున్నది. ఈ మధ్యన పై ఆసాములు నా క్లయింటు భూమిని వేరొకరికి అమ్ముకునుటకు అక్రమంగా ప్రయత్నం చేయుచున్నారని నా క్లయింటుకు తెలియవచ్చినది.

కావున పైతెలిపిన నా క్లయింటు తాలూకు భూమికి సంబంధించి సివిల్ కోర్టులో దావా పెండింగులోనున్నందున సదరు భూమికి సంబంధించి ఎవ్వరైన అమ్మకాలు, కొనుగోళ్ళు వగైరా రిజిస్ట్రేషన్లు జరిపిన యెడల వారు చట్టరీత్యా తీసుకును చర్యలకు బాధ్యులగుదురు.

యస్.వి.వి.ప్రసాదు
అడ్వకేట్, రామ్‌నగర్, యలమంచిలి.
అనకాపల్లి జిల్లా. సెల్:7893803452

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయండి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - అరిలోవ: జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు అన్ని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను చెప్పుకునేందుకు తక్షణమే ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. శుక్రవారం అరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాల సమావేశ మందిరంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా విద్యాశాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాత్రపై అవగాహనా సదస్సు నిర్వహించారు. చినగదిలి ఎంఇఒ ఎం.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా వ్యవహరించారు

ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, ఇతరశాఖలతోపాటు కమిషన్ సమన్వయంతో బాలల హక్కులపై అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఫిర్యాదు పెట్టెల్లో విద్యార్థుల లైంగిక వేధింపులు, దాడులు, జరిమానాలు వంటి వ్యక్తిగత సమస్యలతోపాటు పాఠశాలల తాగునీరు,మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి పాఠశాలల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ ఫిర్యాదులను మండలస్థాయి అధికారులు, వార్డు మహిళా కార్యదర్శులు, బాలల సంరక్షణ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు.

సీనియర్ సైకాలజిస్టులు పార్వతి కాశ్యప్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్, అపుస్మా రాష్ట్ర ట్రెజరర్ ఎంవి.రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ ఎపిసి బి.శ్రీనివాసరావు, ఎంఇఒ అనురాధ, అర్బన్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది బి.శకుంతల, ఆనంద్, శారద, సహాయ కార్మిక శాఖ అధికారి ఎం.విజయ, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమతి పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని షిర్డీ సాయిబాబాకు ఆలయ అర్చకులు పట్నాల మూర్తిశర్మ, శంకర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గాలమ్మ ఆలయంలో శ్రావణశోభ, ఆధ్యాత్మికత సంతరించుకుంది.

కొండ పోరంబోకు ఆక్రమణ!

దబ్బందలో ప్రభుత్వ భూమి కబ్జాకు కూటమి నేతల సన్నాహాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మామిడిలో పంచాయతీ దబ్బంద గ్రామంలో కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిడిపి, జనసేనకు చెందిన కొంతమంది కూటమి నేతల కనుసన్నల్లో భూఆక్రమణ బాహాటంగానే సాగుతోందని విమర్శలున్నాయి.

దబ్బంద గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 56 లో 2.16 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిని శుక్రవారం జెసిబితో కొంతమంది టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి జెసిబితో చదును చేసి, కబ్జాకు పూనుకుంటున్నారని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు వారిని ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు చెబుతున్నారు. అధికారంలో ఉన్నామన్న దర్పంతో కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని, స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి,

జెసిబితో చదును చేస్తున్న ఆక్రమిత స్థలం

కొండపోరంబోకు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్థానిక విఆర్ఒ ప్రమీలను వివరణ కోరగా దబ్బంద గ్రామంలో భూఆక్రమణపై తమకు సమాచారం అందిందన్నారు. దీనిపై ఎలాంటి అనుమతులు లేవని, పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు

పలుచోట్ల జాతీయ అంతరిక్ష దినోత్సవం

జగన్నాథకుమార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, ఫిజిక్స్ విభాగంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఉత్సాహపూర్వకంగా నిర్వహించారు. భారత వాతావరణశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వి. జగన్నాథకుమార్ పాల్గొని మాట్లాడుతూ, అంతరిక్ష సంబంధిత ప్రయోగాలు ఒక సబ్జెక్టుకు పరిమితం కాదనిచ బహుళ శాస్త్రవిషయాల కలయికగా ఉంటాయన్నారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త సబ్జెక్టులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వాతావరణ పరిస్థితులను అంచనా వేయడానికి అంతరిక్ష సాంకేతికతలను భారత వాతావరణ శాఖ ఎలా వినియోగిస్తున్నదో వివరించారు. భారత అంతరిక్ష కార్యక్రమాలను బలపరిచేందుకు సృజనాత్మక ఆలోచనలతో యువత ముందుకు రావాలని సూచించారు.కార్యక్రమంలో గీతం సైన్స్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ చందుకవిత, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతరిక్ష శాస్త్రంపై గీతం విద్యార్థులకు లోతైన అవగాహనకు గీతంలో వాతావరణ ప్రయోగశాలను ప్రారంభించారు.

అంతరిక్షంలో అగ్రగామిగా భారత్

భీమునిపట్నం : అంతరిక్ష శాస్త్రంలో భారత్ అగ్రగామిగా దూసుకుపోతోందని ,చంద్రయాన్,3 విజయవంతంతో యావత్ ప్రపంచం భారత్‌వైపు చూస్తోందని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారంజాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డైట్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, ఇస్రో విజయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్ సుధాకర్, గొట్టేటి రవి, జిజిఎస్ నాగేశ్వరరావు, ఎస్ త్రినాథరావు, ఎం మహాలక్ష్మి, జె మాధవి, ఆర్ నీలిమ పాల్గొన్నారు. 'అంతరిక్ష యానంలో భారతదేశం' అంశంపై ఛాత్రోపాధ్యాయులు వ్యాసాలు రాశారు. రాకెట్లు, లాండర్స్, రోవర్స్, పలు ఉపగ్రహాల నమూనాలను ప్రదర్శించారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన దేవరాపల్లిలో చోటుచేసుకుంది. యువకుని మృతదేహం దేవరాపల్లి సమీపంలో శారదానదిలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. దేవరాపల్లికి చెందిన ఆరిపాక అర్జున కుమారుడు ఆరిపాక రఘు (30) బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడి ఆచూకీ కోసం బంధువులు వెతికారు. శుక్రవారం ఉదయం శారద నదిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు రఘు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుని తండ్రి అర్జున సమాచారం మేరకు దేవరాపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

ఆరిపాక రఘు (ఫైల్‌ఫోటో)

20 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ : 20 లీటర్ల నాటుసారాతో వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేశామని గొలుగొండ ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రెల్లలపాలెం గ్రామానికి చెందిన దూరి బోడేసు(53)ను మండలంలోని సీతకండి గ్రామ సమీపంలో శుక్రవారం 20 లీటర్ల నాటుసారాతో పట్టుకున్నామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. మండలంలో. సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు ఆన్‌లైన్‌లో పద్యాల పోటీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న జిల్లా స్థాయి తెలుగు పద్యాల పోటీ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎం జ్యోతికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆన్లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ఒకరు చొప్పున బాలుడు, బాలిక మాత్రమే పోటీల్లో పాల్గొనాలని సూచించారు. https : // meet. Google.com / gnc.irtp - hiz గూగుల్ మీట్ లింక్ ద్వారా 24 వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల లోపు మెసేజ్ బాక్స్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారు మాత్రమే పోటీల్లో పాల్గొనాలని అర్హులని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధి మించకుండా పద్యాన్ని రాగయుక్తంగా పాడాలని తెలిపారు. 29 న గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి తెలుగు భాషా దినోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

గంభీరం రిజర్వాయర్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే గంటాకు వినతుల జోరు

ప్రజాశక్తి -ఆనందపురం: వరుస ప్రమాదాలతో విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్న గంభీరం రిజర్వాయర్ వద్ద అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల గీతం, గాయత్రి విద్యాపరిషత్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారని, ఇప్పటివరకు వందమందికి పైగానే విద్యార్థులు గంభీరం రిజర్వాయర్‌లో చనిపోయారన్నారు. దీనిపై ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

కంపెనీల కాలుష్యంపై వినతి

గంభీరం పంచాయతీ పరిధిలో కంపెనీలు వెదజల్లే కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం పాడవ్వడంతోపాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానిక సర్పంచ్ వానపల్లి లక్ష్మి కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు విన్నవించారు. బోయపాలెం సమీపంలోని బిగ్‌స్టార్ సి ఫుడ్ కంపెనీ వ్యర్థజలాలను కాలువల ద్వారా పంటపొలాలకు

ఎమ్మెల్యే గంటా, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేత

మళ్లిస్తున్నారని, దీని వల్ల దుర్వాసనతోపాటు పంటలు, పంటపొలాలు పాడయ్యే పరిస్థితి ఉందని వివరించారు. కల్లివానిపాలెంలో తరచూ విద్యుత్ అంతరాయంపై విన్నవించగా, సంబంధిత విద్యుత్‌శాఖ ఎఇఇ సురేష్‌కుమార్ స్పందిస్తూ లోవోల్టేజీ సమస్య వల్ల ఈ పరిస్థితి ఉందని, వెంటనే పరిష్కరిస్తామన్నారు.

కుసులువాడ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

ఆనందపురం: మండలంలోని కుసులువాడ చిన్నమెట్ట(ఎద్దుమెట్ట)పై మైనింగ్ తవ్వకాలకు ఈనెల 28న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు కోరారు. శుక్రవారం గంభీరం గ్రామసభలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్, కుసులువాడ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీలకు వినతి పత్రం అందజేశారు.

కుసులువాడ గ్రామంలో సర్వే నెంబరు 104లో 7.991 హెక్టార్లలో దాదాపు 20 ఎకరాల్లో గ్రావెల్, రఫ్ స్టోన్, క్వార్ట్జైట్‌లను పెద్ద మిషన్లతో తవ్వి, భారీ వాహనాలలో తరలించేందుకు వీలుగా మైనింగ్ అనుమతులు జారీకి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలతో అవునవిపించేందుకు అభిప్రాయసేకరణ తంతు నిర్వహించి, అనుమతులిస్తే, గొట్టిపల్లి, పందలపాక, తర్లువాడ, ముకుందపురం, రేగివానిపాలెం, చిన్నపాలెం, రాణిపేట, బోని, చందక, చిన్నాపురం, జగ్గరాజుపాలెం, సీతంపేట, ఏనుగులపాలెం, తర్లువాడలతోపాటు ఆనందపురం మండలంలో సుమారు 30 గ్రామాలు పూర్తిగా కాలుష్య కోరలలో చిక్కుకొని పంటభూములు, సాగు,తాగునీరు కలుషితమై ప్రజారోగ్యంతోపాటు పైర్లు పాడై, ప్రజల జీవనం దుర్భరమౌతుందన్నారు. మైనింగ్‌తో పర్యావరణానికి వాటిల్లే ప్రభావంపై హైడ్రాలజీ విభాగం డ్రాఫ్ట్ (ఐఎఐ)ని ఇంగ్లీషులో కాకుండా తెలుగులో ముద్రించి, ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేత వి సత్యనారాయణ, ఎం. డి. బేగం, ఎం అప్పలనాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలి

ప్రజాశక్తి- మాధవధార : వరుస ఫార్మా ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడంతోపాటు, ఆయా ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడం, క్షతగాత్రులకు అవసరమైన మెరుగైన వైద్యం అందించేందుకు పారిశ్రామిక వాడలన్నింటిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించాలని ఎపి కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ఫార్మా ప్రమాదం నుంచి ఇకనైన గుణపాఠం నేర్చుకుని, ఫార్మా ప్రమాదాల నివారణకు అవసరమన శాశ్వత పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. విశాఖపట్నం, విజయవాడ, శ్రీ సిటీ, నెల్లూరు, కాకినాడ, కర్నూల్ వంటి పారిశ్రామిక ప్రాంతాలలో ట్రామాకేర్ సెంటర్లతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను అన్ని విభాగాల వైద్యనిపుణులు, అవసరమైన వైద్యసిబ్బంది, పూర్తిస్థాయిలో అత్యాధునిక వైద్యసౌకర్యాలతో ఏర్పాటు చేయాలని కోరారు. ఖరగ్‌పూర్ ఐఐటి నిపుణుల అధ్యయనం మేరకు పరిశ్రమలను సురక్షితంగా మార్చేందుకు, పటిష్టమైన భద్రతకు సమీకృత కార్యాచరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వెంకటరావు కోరారు.

అందుబాటులో లేని సర్వేయర్‌తో అవస్థలు!

● అసలు ఉన్నట్టా.. లేనట్టా? అంటున్న జోన్‌వాసులు ● సకాలంలో పనులు జరగక చిక్కులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయంలో సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో సకాలంలో పనులు జరగక జోన్ పరిధిలోని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు, ఖాళీస్థలాల పన్నులు, ఇంటి రుణాలకు సంబంధించి స్థల ధ్రువీకరణ, ఇతరత్రా పలు పౌర సేవలకు సంబంధించి, సర్వేయర్ పరిశీలన సర్టిఫికెట్ అందజేస్తేనే ఇతర అనుమతులు, పనులు జరుగుతాయి. అయితే సంబంధిత సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని, అంతేకాక ఆయా పనులపై దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా పత్తా లేని సర్వేయర్ స్పందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు లబోదిబోమంటున్నారు.
కొన్ని సందర్భాల్లో ఒక్కొక్కరి సర్టిఫికెట్ జారీకి ఐదారు నెలలకు మించి సమయం పడుతోందని, కొందరికి సర్వేయర్ సర్టిఫికెట్ అందడం గగనమౌతోందని వాపోతున్నారు. ఒక ఉద్యోగి ఇంటి నిర్మాణానికి బ్యాంకు రుణం కోసం తన ఖాళీ స్థలం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుని ఏకంగా ఐదేళ్లు గడిచినా పని జరగలేదని ఆరోపిస్తున్నారు. ఇలాగే ఎంతోమంది జోన్‌పరిధిలోని నివాసితులు సర్వేయర్ తీరుతో సకాలంలో పనులు జరగక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.
జోనల్ కమిషనర్ అజమాయిషీలో కాకుండా, సంబంధిత శాఖ అధికారుల అధీనంలో, జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న గాజువాక జివిఎంసి సర్వేయర్ ఎపుడు కార్యాలయానికి వస్తారో, ఎంతసేపు ఉంటారో, అంతా ఆయన ఇష్టారాజ్యంగానే సాగుతోందని అర్జీదారులు వాపోతున్నారు. దీనిపై స్థానిక జివిఎంసి జోనల్ కమిషనర్‌నుగానీ, సిబ్బందినిగానీ ఎవరిని అడిగినా సమాధాన దొరకని పరిస్థితి ఉందని అంటున్నారు.పనుల జాప్యంపై ఎవరైనా అడిగితే, వారిపై చిందులేయడం, వారి పనులను చేయకుండా కావాలనే జాప్యం చేయడం వంటివి చేస్తుండడంతో ఈయన జోలికి వెళ్లాలంటే స్థానికులు జంకుతున్నారు. అప్పట్లో స్పీకర్ తమ్మినేని సీతారాం పేరుచెప్పి పబ్బం గడిపేసిన ఆయన, ఇపుడు అదే ఆమదాలవలన నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ పేరుచెప్పి బెదిరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెట్టి, సర్వేవిభాగానికి సంబంధించిన పౌరసేవలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జోన్ వాసులు కోరుతున్నారు.
దీనిపై జోనల్ కమిషనర్ వివరణ సన్యాసిరావు వివరణ కోరగా, సర్వేయర్ తీరుపై తనకు వచ్చిన ఫిర్యాదుల మేరకు చాలాసార్లు చెప్పానని, అయితే తన అజమాయిషీలో లేకపోవడంతో సంబంధిత శాఖ అధికారులకు లేఖ రాశానన్నారు.

ట్రిపుల్ ఐటి విజేతలకు నగదు నజరానా

దాత సిఎంఆర్ సంస్థకు ఆర్‌జెడి అభినందన

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటి విజేతలకు సిఎంఆర్ సంస్థ నగదు బహుమతులు అందజేసింది. శుక్రవారం విశ్రాంత పోలీసు అధికారి టిఎస్‌ఆర్ ప్రసాద్, విద్యాశాఖ ఆర్‌జెడి విజయభాస్కర్ తదితరులతో కలసి ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు సిఎంఆర్ సమకూర్చిన నగదు బహుమతులు అందజేశారు. వికలాంగుల కోటాలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన కె. మైధిలి. వై.హారికలకు చెరో రూ.25వేలు చొప్పున, అలాగే నూజివీడు ట్రిపుల్ ఐటిలో ప్రవేశం పొందిన తరుణ్. శ్రీకాకుళంలో సీటు సాధించిన డి.యశ్వంత్, ఎల్. అచ్యుతరావులకు చెరో రు.15వేలు చొప్పున నగదుతోపాటు ఇతర సామగ్రి విద్యాసామగ్రిని అందజేశారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్‌పిఎస్ఎస్వీఎస్ సోమయాజులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సునీల్ మహంతి, పీడీ రాము. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సభ్యులు సునీల్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన జియ్యాని

ప్రజాశక్తి- వేపగుంట : అచ్యుతాపురం ఫార్మా మృతుల కుటుంబాలు, బాధితులను పరామర్శించేందుకు విశాఖ చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసి, స్వాగతించారు.

జగన్‌తో జియ్యాని శ్రీధర్

ఉత్తమ సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఉత్తమ యాజమాన్య పద్ధతులతో సాగు చేయడం ద్వారా నాణ్యమైన, అధిక పంట దిగుబడులను సాధించవచ్చని అధికారులు సూచించారు. శుక్రవారం మండలంలోని బోని గ్రామంలో ఉత్తమ సాగుయాజమాన్యం, వరి పంటకు మద్దతు ధర, మార్కెటింగ్ సదుపాయం, పంట నిల్వకు గోదాం ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఆంధ్రాయూనివర్సిటీ అల్యూమినీ సహకారంతో నిర్వహించిన సదస్సులో నాబార్డ్ డిఎం సామంత్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలను నిల్వ, భద్రపరచుకుని, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి వీలుగా అవసరమైన గోదామును నాబార్డు ఎఫ్‌పిఒ ద్వారా రాయితీ రుణమిచ్చి నిర్మాణానికి సహకరిస్తామన్నారు. నాబార్డు సమకూర్చిన డ్రోన్‌తో వరిపొలంలో మందుల పిచికారీపై క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చేసి చూపించి, రైతులకు వివరించారుభీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో . ఎయు అల్యూమిని చైర్మన్ శంకరరావు, సమైక్యాంధ్ర చైర్మన్ ఆడారి కిషోర్‌కుమార్, ఆనందపురం ఎఒ సిహెచ్.సంధ్య రత్నప్రభ, ఆర్‌బికె అగ్రికల్చర్ ప్రతినిధి వరప్రసాద పాల్గొన్నారు

డాక్టర్ గుళ్లపల్లికి ప్రతిష్టాత్మక ఐసిఒ అవార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్.వి.ప్రసాద్ నేత్ర విజ్ఞానసంస్థ స్థాపక అధ్యక్షులు డాక్టర్ గుళ్ళపల్లి ఎన్ రావుకు ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆప్థల్మాజీ ప్రతిష్టాత్మక ఐసిఒ జూల్స్ ఫ్రాన్సువా-2024 స్వర్ణ పతకం ఇచ్చి సత్కరించింది. కెనడా వాంకూవర్లో ఈనెల 16న జరిగిన ప్రపంచ ఆప్తల్మాలజీ కాంగ్రెస్ 2024లో ఈ అవార్డును డాక్టర్ గుళ్లపల్లి అందుకున్నారు.
ప్రతి నాలుగేళ్లకోసారి అత్యున్నత వైజ్ఞానిక నాణ్యత గల నేత్ర సంబంధిత కృషికి ఐసిఒ జూల్స్ ఫ్రాన్స్వా ఈ అవార్డుతోపాటు స్వర్ణపతకం అందజేస్తుంది. ప్రతిష్టాత్మక ఈ అవార్డుతో గౌరవించబడిన మొదటి భారతీయ వైద్యనిపుణులు డాక్టర్ రావు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు పదకొండు మందికి ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఐసిఒ అందజేయగా, ఈ స్వర్ణ పతకంతో గౌరవించబడ్డ మొట్టమొదటి నేత్ర వైద్యులుగా డాక్టర్ ఎన్‌రావు గుర్తించబడ్డారు. 1987లో స్థాపించిన ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఇప్పటివరకు 3.68కోట్ల మందికిపైగా రోగులకు కంటిచూపును ప్రసాదించడం, కంటి సమస్యలకు వైద్యసేవలను అందించింది. అనేక ప్రపంచ సంస్థలతో క్రియాశీలక భాగస్వామ్యంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ పనిచేస్తోంది.

డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు

జగన్ పర్యటనకు తిప్పల కుటుంబీకులు డుమ్మా!

ప్రజాశక్తి- గాజువాక : ఉమ్మడి విశాఖ జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పర్యటనలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆయన ఇద్దరు కుమారులు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొనకపోవడంపై ఇపుడు గాజువాకలో సర్వత్రా చర్చనీయాంశమైంది. అచ్యుతాపురం ఫార్మా మృతుల కుటుంబాలతోపాటు అనకాపల్లిలో క్షతగాత్రులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి అనకాపల్లి పర్యటనకు వెళ్లడంతోపాటు మధ్యాహ్నం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటికి కూడా జగన్ వచ్చారు. అయితే ఎక్కడా కూడా తిప్పల కుటుంబీకులు పాల్గొనలేదు. మాజీ సిఎం జగన్‌ను కలవలేదు. దీనిపై వైసిపి శ్రేణులతోపాటు స్థానికులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

వర్గీకరణతో దళితులకు నష్టమే!

మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- సీతమ్మధార : దళితుల వర్గీకరణ మంచిది కాదని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్‌సిల వర్గీకరణ చేపడితే వారికి నష్టం జరుగుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఒకపుడు అంటరానివారిగా చూసే దళితులకు అంబేద్కర్ , నెహ్రూ తదితరులు కృషి ఫలితంగా రిజర్వేషన్లు ఇచ్చారని, ఇపుడు ఎస్‌సి వర్గీకరణతో విభజించు, పాలించు కుట్రను కేంద్రం అనుసరిస్తోందన్నారు.దీని వల్ల దేశ సమగ్రత దెబ్బతినడంతోపాటు పక్క బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభ పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు లో రాజ్యాంగ స్ఫూర్తి లేదని విచారం వ్యక్తం చేశారు. 2028లో అన్ని రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలో భాగంగానే ఇపుడు దళితుల వర్గీకరణ రిజర్వేషన్‌ను కేంద్రం తెరపైకి తెచ్చిందని ధ్వజమెత్తారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టుపై సిఎం చంద్రబాబు వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి హుండీలో భక్తులు వేసిన కానుకల్లో దాదాపు రూ.1200కోట్లను గత వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించి వృథా ఖర్చు చేసిందని, ఈ వ్యవహారంలో పదిశాతం కమిషన్ కింద దాదాపు 120కోట్లు చేతులు మారాయన్నారు. ఈ వ్యవహారంలో ఫైళ్లు కాలిపోవడం, విచారణ దశలో ఉండగా ఎస్పీ స్థాయి అధికారిని మార్చడం వంటివాటిపై సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చంద్రబాబు, కిరణకుమార్‌రెడ్డి, జగన్మోహనరెడ్డి హయాంలో జరిగిన ఖర్చులపై వివరాలను బహిర్గతం చేయాలన్నారు. ఆర్థికనేరాలు, అక్రమాలపై ఇడి, సిబిఐ విచారణ ఏళ్లతరబడి సాగుతూ, నిద్రాణవస్థలో ఉండడం శోచనీయమని మండిపడ్డారు.

మాట్లాడుతున్న చింతా మోహన్

ఫార్మా మృతులకు తక్షణ పరిహారం అభినందనీయం

అచ్యుతాపురంలోని ఎసెన్షియా, సినర్జీస్ ఫార్మా కంపెనీలలో ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ఫార్మా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి పరిహారం ప్రకటించి, వెంటనే ఇవ్వడం సంతోషకరమన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఆనందపురం శొంఠ్యాంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం గ్రామంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ టి చంద్రశేఖర్, శొంఠ్యాం పిహెచ్‌సి వైద్యాధికార్లు డాక్టర్ పి పద్మావతి, డాక్టర్ బి రమేష్‌కుమార్ ఎంపిహెచ్ఇఒ పరమేశ్వరరావు, హెచ్ఎస్ ఈశ్వరరావు, లింక్ వర్కర్ ఎ.సుజాత, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, ఐసిటిసి ఆధ్వర్యంలో శుక్ర వారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ రావి వెంకటరాజు మాట్లాడుతూ, హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, వ్యాధి సంక్రమించకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి లక్షణాలు తదితర వివరాలను వెల్లడించారు దీనికి సంబంధించి ఏయే పరీక్షలు చేయించాలి, వ్యాధి నిర్ధారణ అయితే జీవన ప్రమాణం పెంచుకోవడానికి ఏయే మందులు వాడాలనే అంశాలపై వివరించారు. విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి పోవద్దని కోరారు. ఎవరికైనా సందేహాలుంటే 1097 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సూర్య ప్రసాద్, అధ్యాపకులు హనుమంతరావు, యువ క్లినిక్ కౌన్సిలర్ సత్య, మీనాక్షి, ఆశాలు పాల్గొన్నారు

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- పెందుర్తి : ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, పలు పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకోవడం, కార్మికుల ప్రాణాల కోల్పోవడం బాధాకరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహమూర్తి అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరారు. కాలుష్యం, భద్రతా విభాగానికి సంబంధించిన అధికారులు రెగ్యులర్ పర్యవేక్షణతో పరిశ్రమల్లో భద్రతను పటిష్టం చేయడంతోపాటు ఇటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతోపాటు బాధిత కుటుంబాలకు భరోసాగా ఉండి న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే, పరిశ్రమలో ప్రమాదాలు కొనసాగుతూ, కార్మికుల ప్రాణాలు గాల్లో పెట్టిన దీపాలుగా మారడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టండి

సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

అచ్యుతాపురంలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

పరిశ్రమల్లో తరుచూ జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలంటూ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రైవేట్ పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ జరిపి భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ఘోర దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలన్నారు. ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం జరిగిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు. పరిశ్రమల్లోకి వెళ్లిన కార్మికుడు తిరిగి సేఫ్టీగా తిరిగి వస్తాడన్న గ్యారంటీ లేదన్నారు. భద్రతా చర్యలు లేకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. పని ప్రదేశంలో భద్రత కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మా కంపెనీల వారు లాభాలు సంపాదించుకొని ధనవంతులుగా మారుతున్నారు తప్ప కార్మికులకు భద్రత కల్పించడం లేదన్నారు. యజమానులపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోకుండా వారికి అండగా నిలవడం సరైంది కాదన్నారు. ఎల్‌జి పాలిమర్స్ ఘటన నుంచి ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోలేదన్నారు. చంద్రబాబు 2019లో ఓ జిఒ తెచ్చారని, ఫార్మా, ఎస్ఇజెడ్‌లలో ఎటువంటి తనిఖీలూ జరపకూడదని ఆ జిఒలో పొందుపర్చారని అన్నారు. యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దీనినిబట్టే అర్థమవుతోందన్నారు. తక్షణమే అన్ని పరిశ్రమలపై ఆడిట్ జరిపి, భద్రతా చర్యలు లేని యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, యు.రాజు, టి.నూకరాజు, కె.చంద్రశేఖర్, పి.వెంకటరావు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు, ఈశ్వరరావు, కుమారి, ఒ.అప్పారావు, జి.అప్పలరాజు, కెఎం.కుమార్ మంగళం, చంద్రమౌళి, నాయుడు పాల్గొన్నారు.

ఎసెన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని రాస్తారోకో

అచ్యుతాపురం : ఎసెన్షియా పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం అచ్యుతాపురం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. దీంతో పూడిమడక, అనకాపల్లి, ఎలమంచిలి, గాజువాక మార్గాల్లో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమ యజామాన్య నిర్లక్ష్యం 18 మంది కార్మికుల బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి చావుకి కారణమైన ద్విచక్ర వాహనదారుడుని వెంటనే అరెస్టు చేస్తున్నారని, కాని పరిశ్రమలో పనిచేసే కార్మికుల నిండు ప్రాణాలు పోయినా ఆ యాజమాన్యాలను అరెస్టు చేయడం లేదని పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ చేస్తే పరిశ్రమలు మూతబడతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పడం చాలా హాస్యాస్పదంగా, విచారకరంగా ఉందన్నారు. కార్మికుల ప్రాణాలు పోతే ప్రభుత్వాలు పట్టించుకోవా అని ప్రశ్నించారు. పరిశ్రమ యాజమాన్యాలు ప్రభుత్వాలను కూడా పట్టించుకోవడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. భద్రతా ప్రమాణాల పాటించని పరిశ్రమలను ప్రభుత్వం సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మాట్లాడుతూ స్థానిక పరిశ్రమలలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులకు వైద్య సేవల నిమిత్తం స్థానికంగా 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దేవుడు నాయుడు, నాయకులు రామకృష్ణ, బ్రహ్మాజీ, సిహెచ్ శివాజీ, నూకన్న, నారాయణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన

అనకాపల్లి : అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం చిన్న సెక్షన్లతో కేసు నమోదు చేయడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు అన్నారు. 17 మంది మృతికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠినమైన శిక్షలు విధించే విధంగా కేసులు నమోదు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమం బి.రాజు, కళ్యాణం, రాము, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై విచారణ జరిపి కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నర్సీపట్నం కృష్ణ బజార్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ మరణించిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి క్షతగాత్రులైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజ మాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని విమర్శించారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు ఆర్.గోవిందు, ప్రసాద్, ఎం.రమణ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో నిరసన

బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఫార్మా బాధితులకు కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి

అచ్యుతాపురం ఎసెన్షియా అడ్వాన్స్ సైన్స్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద సంఘటనలో క్షతగాత్రులైన ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ శుక్రవారం ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందనివారికి మనోధైర్యాన్ని కల్పించారు. అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం ముఖ్యమంత్రి సంఘటన జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, ఏపీఐఐసీ, బ్రాయిలర్ , ఫైర్, ఇండస్ట్రీస్ తదితర జిల్లా అధికారులతో రివ్యూ చేయడం జరిగిందని తెలిపారు. పారిశ్రామికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యోగుల భద్రతపై చర్యలు చేపడతామని చెప్పారు. మరణించిన 17 మంది ఉద్యోగుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున 17 చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి దీపికా పాటిల్, ఆర్డీవో చిన్నికృష్ణ, డిసిహెచ్ ఎస్ శ్రీనివాసరావు, ఉషా ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఘాట్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి శారదా నది వినాయక ఘాట్ వద్ద సెప్టెంబర్ 7వ తేదీన జరిగే వినాయక చవితి నుంచి గణపతి నవరాత్రులు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జోత్సవ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జివిఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయంలో అనకాపల్లి జోన్ కమిషనర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నవరాత్రులు పూర్తి అయ్యేవరకు శానిటేషన్ లైటింగ్ ఏ ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఘాటు వద్ద గజ ఈతగాలను ఫైర్ సిబ్బందిని, పోలీసులతో రక్షణ కోసం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందిస్తూ పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు కొణతాల హరినాథ్ బాబు, సుంకర చంద్రం, దాడి బుజ్జి ఆడారి రవి, బొబ్బిలి సురేష్, పి వరప్రసాద్, బి జనార్దన్ పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రికి పురస్కారం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ విద్య-బాలబడి ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్యను అభివృద్ధి చేయడంపై టైమ్స్ గ్రూప్ ఆఫ్ సిఎస్ఆర్ టైమ్స్ వారు రజత పురస్కారాన్ని శుక్రవారం అందించారు. ప్రాజెక్ట్ విద్య 2018-19 నుండి అమలులో ఉంది. ఎఎస్ఆర్ జిల్లాలోని జి మాడుగుల, చింతపల్లి గిరిజన గ్రామాలలో మూడు పాఠశాలలు, అభ్యాస కేంద్రాలకు మద్దతు ఇస్తుంది. అనకాపల్లిలోని ఎన్జీవో ఆర్‌డిఎస్ఎస్ సహాయంతో అమలు చేయబడింది. ఆగస్టు 23న గోవాలోని పనాజీలోని రాజ్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన 11వ జాతీయ సిఎస్ఆర్ టైమ్స్ అవార్డ్స్ 2024లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎన్టిపిసి సింహాద్రి తరపున సింహాద్రి జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఎస్సార్ మేనేజర్ కె.ప్రకాశరావు అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు గోవా సదానంద, జ్యూరీ సభ్యులు డాక్టర్ భాస్కర్ ఛటర్జీ, సిఎస్ఆర్ టైం ఎడిటర్ హరీష్ చంద్ర, సుభాష్ ఉత్తమ్ ఫల్ దేశాయ్ సహా విశిష్ట అతిథులు పాల్గొన్నారు.

రజత పురస్కారం అందుకుంటున్న ఎన్‌టిపిసి సింహాద్రి అధికారులు

ప్రమాదాలు జరిగితేగానీ పట్టించుకోరా?

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రమాదాలు జరిగితేగాని ప్రభుత్వం, అధికారులు పట్టించుకోరా? అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న ప్రశ్నించారు. దేవరాపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తమ ప్లేట్లును రైవాడ కాలువలో కడుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాల పక్కనే ప్రవహిస్తున్న రైవాడ జలాశయ కాలవ నీటిలో ప్లేట్లను శుభ్రపరచుకుంటున్నారని, దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పిల్లలకు ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే తప్ప చర్యలు తీసుకోరా? అంటూ ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణిపై మండిపడ్డారు. ప్లేట్లు కొడుక్కోవడానికి అవసరమైన నీటి వసతి పాఠశాలల్లో ఉందా? లేదా? అని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్లేట్లు శుభ్రపర్చుకోవడానికి పాఠశాల ఆవరణలో నీటి వసతి ఏర్పాటు చేయాలని, కాలువకు విద్యార్థులు వెళ్లకుండా చూడాలని వెంకన్న కోరారు.

పాఠశాల పక్కనే ఉన్న రైవాడ కెనాల్‌లో ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక ఎఎంఎఎ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చదువుతున్న పేద విద్యార్థుల్లో మెరిట్ కనబర్చుతున్న వారికి శుక్రవారం పూర్వ విద్యార్థులు స్కాలర్ షిప్‌లు అందజేశారు. పాఠశాల 1972 బ్యాచ్ పదవ తరగతి పూర్వపు విద్యార్థుల సమావేశం శుక్రవారం పాఠశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరయ్యారు. ప్రతి సంవత్సరం జరిగే 1972 బ్యాచ్ పూర్వ విద్యార్థుల 27వ సంవత్సరం సమావేశ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, డాక్టర్ దక్షిణామూర్తి, గుర్రం ప్రసాద్, కేపివి రమణయ్య, వామాల కోటేశ్వరరావు, నలినీకాంత్, రాజేశ్వర ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్ షిప్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

క్రికెట్ టోర్నమెంటను ప్రారంభిస్తున్న దృశ్యం

డిప్యూటీ సిఎం కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం

ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని జిల్లా సీనియర్ జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెందుర్తి నియోజకవర్గ స్థాయి డిప్యూటీ సీఎం కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను జనసేన నేతలు సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ శుక్రవారం స్థానిక మదర్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు దేహదారుడ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నేతలు గండి ముత్యాల నాయుడు, కిల్లి వెంకట సత్యనారాయణ, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, కర్రి నరసింగరావు, బోకం స్వామినాయుడు, అండి బోయిన బంగారయ్య, టి. శేఖర్, పెద్దాడ రమణమ్మ, సబ్బవరపు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'జగన్ ఎప్పటికీ సిఎంగా పనికిరారు'

ప్రజాశక్తి -అనకాపల్లి : వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎప్పటికీ పనికి రారని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ విమర్శించారు. ఎంపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే స్పందించి మంత్రులను, ఎంపీలను, ఎమ్మెల్యేలను, కలెక్టర్, ఎస్పీలను సంఘటన స్థలానికి పంపి సమీక్ష చేశారని తెలిపారు. క్షతగాత్రులను కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వాహనాల్లో తరలించి వైద్య సహాయం అందేలా చూసారన్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు కొన్ని గంటల్లోనే పరిహారం కంపెనీ ద్వారా చెల్లించినట్లు చెప్పారు. మహిళ అధికారులైన కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక సంఘటన స్థలంలో ఉండి అన్ని సహాయక చర్యలు చేపట్టారన్నారు. ఇవేమీ తెలియని మాజీ ముఖ్యమంత్రి జగన్ తన వెకిలి చేష్టలతో బాధితులను పరామర్శించడం, సహాయక చర్యలు తీసుకోలేదని విమర్శించడం తగదన్నారు. త్వరలోనే ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమల యాజమాన్యాలతో ఇండస్ట్రీ సెక్రటరీ, నిపుణులు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలను చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జి, ముత్యాల పాప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రిపరేషన్ తయారీ, డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కలిసి అంతరిక్ష పరిశోధనలు, భూమి యొక్క వాతావరణ కాపాడుటపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి ఎం.కాళీదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏంఎస్.స్వర్ణ కుమారి, పిడి పెంటకోట కమల, పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిహెచ్‌సిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని సిపిఎం నాయకులు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, జనరేటర్ సౌకర్యం కల్పించాలని, దీర్ఘకాలిక ఉద్యోగులను బదిలీ చేయాలని, అంబులెన్స్‌ను రిపేర్ చేయాలని, పోస్టుమార్టం సేవలను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి యస్వీ నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రెండు నియోజక వర్గాలకు ముఖ్య కేంద్రంగా ఉన్న చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి పూర్తిగా అధ్వానంగా ఉందన్నారు. కరంటు పోతే ఇన్వెర్టర్లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఇంత పెద్ద ఆసుపత్రికి జనరేటర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ రెండు సంవత్సరాల నుండి పని చేయడం లేదన్నారు. గతంలో పోస్టుమార్టం సేవలు ఉండేవని, బిల్డింగ్ కూలిపోయిందని ఇక్కడ పోస్టుమార్టం చేయడం లేదని, దీంతో రెండు నియోజకవర్గాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎక్స్ రే టెక్నిషన్ ఉన్నా ఎక్స్‌రే మిషన్, ఎముకల డాక్టర్ లేకపోవడంతో ఆ సేవలు అందడం లేదన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన వారిని, డెలివరీ అయిన వారిని ఒకే వార్డులో పెడుతున్నారని, దీని వల్ల అంటురోగాలు వచ్చే ప్రమాదముందని తెలిపారు. ఆసుపత్రిలో కొంత మంది దీర్ఘకాలికంగా ఇక్కడే పనిస్తూ ప్రైవేటు క్లినిక్‌లు పెట్టుకొని, ఆసుపత్రికి వచ్చే రోగులను విస్మరిస్తున్నారని విమర్శించారు. మరి కొంత మంది విశాఖపట్నం తిరుగుతున్నారని, మధ్యాహ్నం అయితే ఆసుపత్రిలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి పై సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఆంధ్ర కేసరి టంగుటూరికి ఘన నివాళి

టంగుటూరికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ దయానిధి తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కలెక్టర్ కార్యాలయ వీసీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, కోపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీకి ఎదురు నిలిచి చొక్కా విప్పతీసి గుండెచూపి 'కాల్చమని' నిబ్బరంగా నిల్చి తెల్లదొరలను హడలెత్తించి ఆంధ్రకేసరి అని పేరు పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, ఆర్ఐవిఎస్ఎస్‌సిహెచ్. చంద్రశేఖర్, ఏఓ బి.శారద, ఎస్సై బి.అంజిబాబు పాల్గొన్నారు.

ఎఎంఎఎల్ కాలేజీలో..

స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు పూలమాలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మూడో రోజుకు మాజీ ఎంపిటిసి నిరాహార దీక్ష

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని పెదకలవలపల్లి గ్రామంలో నేవీ ప్రహరీ నిర్మాణం వల్ల రైతులు నష్టపోతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మాజీ ఎంపిటిసి సభ్యులు రావి దేవుళ్లు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 3వరోజుకు చేరింది. ఈ సమస్యపై ఇప్పటికే 300 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న విషయం విధితమే. దీనికి అధికారులు స్పందించకపోవడంతో దేముళ్లు నిరవధిక దీక్షలకు దిగారు. ప్రహరీ వల్ల అనేక మంది రైతులు సాగు చేస్తున్న జీడి మామిడి, కొబ్బరి ఫలసాయం నష్టపోతున్నామని, తమ జిరాయితీ భూములకు రహదారులు కోల్పోతున్నామని పాడి పశువుల మేతకు ఇబ్బందులు వస్తాయని తెలిపారు. శారదానది నది పొంగినప్పుడు కొండలే దిక్కని, ప్రహరీ నిర్మాణం చేస్తే కొండపైకి వెళ్లడానికి వీల్లుండదని, ప్రహరీ నిర్మాణం ఆపాలని కోరారు. ప్రభుత్వాధికారులు, ప్రభుత్వం, నేవీ వారు జోక్యం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తున్న దేవుళ్లు

నాగేంద్రస్వామి ఆలయ పున:ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని దిబ్బవీధిలో గల శ్రీనాగేంద్ర స్వామి ఆలయ పున:ప్రారంభ మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. కొబ్బరి తోటలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీ నాగేంద్ర స్వామి, కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామిలకు పాలాభిషేకం వైభవంగా జరిగింది. అర్చకులు కొడుకుల సుబ్రహ్మణ్య శర్మ (చారీ) ఆధ్వర్యంలో వేద పండితులు ఈ కార్యక్రమాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనమండలి సభ్యుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామికి శ్రీ నాగేంద్ర స్వామికి పూజలు చేశారు. అనంతరం నాగ జగదీశ్వరరావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, కోశాధికారి కొణతాల త్రినాధరావు, ఆలయ సలహా సభ్యులు ఎల్లపు గోవిందా, ఎల్లపు సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు మద్దాల క్రాంతికుమార్. మల్ల జగదీష్, పీలా గిరి, ఆలయ ప్రోత్సాహకులు రాపేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయబాబు

ట్రాన్స్ జెండర్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ట్రాన్స్ జెండర్స్ అనే విషయంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బిఎ సైకాలజీ చదివిన ట్రాన్స్ జెండర్ కోమలి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ట్రాన్స్ జెండర్స్‌కు, హిజ్రాలకు ఉన్న తేడాను వివరించారు. ట్రాన్స్ జెండర్ అనే పదానికి నిర్వచనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు మాట్లాడుతూ సమాజంలో ఆడవారు, మగవారుతో పాటుగా ట్రాన్స్ జెండర్స్ కూడా ఉంటారని తెలిపారు. కొంత జన్యు సంబంధిత తేడాను కలిగి ఉన్నప్పటికీ మనమంతా వారిని మన తోటివారిగా గుర్తించి గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని లంకెలపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాసవ్య మహిళా మండలి, ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారిచే మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రారంభం నుండి ఎల్లప్పుడూ అందరి మనస్సులను ఒకే విధంగా పెంపొందించడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, లక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ బి.అనుశ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు, కాలువల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు లంకెల పాలెం పరిధి అన్నపూర్ణ నగర్, చీకటి వీధిలలో డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రజలతో ఆయన మాట్లాడారు. పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో 79వ వార్డు గ్రామ పెద్దలు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట

- అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సజావుగా గ్రామ సభలు

అనకాపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఆదేశాల మేరకు అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి హామీలో భాగంగా చేపట్టే పనులను గుర్తించారు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

నక్కపల్లి:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయని సర్పంచ్‌ల్లో ఆశలు చిగురించాయని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని ఉపమాక గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో హెూంమంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్ హాజరయ్యారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, తెలుగు యువత నాయకులు కొప్పిశెట్టి బుజ్జి ఘన స్వాగతం పలికారు.ముందుగా ఉపాధి హామీ పథకం పీడీ సందీప్

కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. తెలుగు యువత నాయకులు కొప్పిశెట్టి బుజ్జి గ్రామంలో నెలకొన్న సమస్యలను హెూం మంత్రి, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.అనంతరం హెూం మంత్రి మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని, తద్వారా వాటిని అమలు చేయనున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధి పథకాన్ని పక్కన పెట్టిందన్నారు.పంచాయతీ నిధులను వేరే వాటికి మళ్లించడంతో వాటి అభివృద్ధి కుంటు పడిందన్నారు.ఉపాధి పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయనున్నమని తెలిపారు.వ్యవసాయ పనులను కూడా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్నామన్నారు.

ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నిటిని దశలు వారీగా ప్రాధాన్యతను బట్టి అమలు చేస్తామన్నారు.యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. .మంత్రి అనిత, ఎంపీ లకు ఉపమాక వెంకన్న చిత్రపటాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు .

చీడికాడ :గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు దోహదపడతాయని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జయప్రకాశరావు తెలిపారు.మండలంలోని 13 సచివాలయ పరిధిలోని 23 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలో సచివాలయం వద్ద కార్యదర్శి ఎన్ఎస్ రావు, జి కొత్తపల్లిలో సర్పంచ్ సూరి నాయుడు, కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను గుర్తించారు.

మారని అధికారుల తీరు
గ్రామసభలపై సమాచారం ఏదీ?

గ్రామ సభల నిర్వహణ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మండలంలో గ్రామసభల నిర్వహణకు సంబంధిత అధికారులు విలేకరులకు సమాచారం అందించకపోవడం గమనార్హం. గత వైసిపి పాలనలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు విలేకరులకు సమాచారం ఇవ్వద్దు అని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులకు సమావేశపరిచి మరీ చెప్పారు. అయితే అదే బాణీలో ప్రస్తుతం అధికారులు కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మార లేదు.

కోటవురట్ల:గ్రామ అభివృద్ధికి సర్పంచులే కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని గ్రామసభలలో మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ తెలిపారు.మండల స్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు.ఎంపీడీవో కాశీ విశ్వనాథ రావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, పంచాయితీ విస్తరణ అధికారి భానుజీరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం నిర్వహించిన గ్రామసభ మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 27 పంచాయతీల్లో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏడి మోహన్‌రావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, డిటి భరత్, ఎంఇఒ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసి రాధిక, ఏపిఎం మంగ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి:గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు టిడిపి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కూండ్రంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణతో కలిసి కొణతాల పాల్గొన్నారు. తుమ్మపాలలో సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు. గొలగాం గ్రామసభకు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు హాజరయ్యారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ గ్రామసభలో ఎంపీ సిఎం.రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రెల్లి నాగయ్యమ్మ, నాయకులు గల్లా రాజు, కాయల మురళి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కొరువాడలో జరిగిన గ్రామసభలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రసంగించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పలరాజు, డాక్టర్ నాయుడు, సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, ఎంపీటీసీ చీపురుపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని చోడవరం గ్రామసభలో స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు పాల్గొని రానున్న ఏడాది కాలం పాటు నిర్వహించే ఉపాధి హామీ పనుల మెటీరియల్ వర్క్‌లను పొందుపరిచారు.

సబ్బవరం : సబ్బవరం పంచాయతీలో జరిగిన గ్రామసభకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాద్ రావు, ఎంపిడీవో రమేష్ నాయుడు, ఈఓఆర్‌డి మహేష్ పాల్గొన్నారు. మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాట్లాడారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పంచాయితీలో జరిగిన గ్రామభలో డిపిఒ శిరీషారాణి పాల్గొని ప్రసంగించారు. బంగారుమెట్ట, ఎల్బీపీ అగ్రహారం, పొట్టి దొరపాలెం, కోమలపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం గ్రామాల్లోనూ గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లోవరాజు, సత్యనారాయణ, సర్పంచులు మెరుగు కుమారి, శ్రీనివాసరావు దాసు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: మండలంలోని దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం గ్రామ సభల్లో తహసిల్దార్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. రాబోవు ఐదు సంవత్సరాలకు సంబంధించి గ్రామసభల్లో పనులను గుర్తించారు.

పరవాడ : మండలంలోని వెన్నెలపాలెంలో గ్రామసభలో సిసి రోడ్లు, మట్టి రోడ్లు, చెరువు పనులపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఉప సర్పంచ్ సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ సన్యాసిరావు, నరసింహారావు, కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని దిమిలి గ్రామసభలో 87 రకాల పనులపై గ్రామ నాయకులు, ప్రజలు చర్చించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, ఉపసర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ

గొలుగొండలో మాట్లాడుతునన జెడ్పిటిసి

ఆనందపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

కొట్టాపు లక్ష్మి పాల్గొన్నారు. చిన్న కలవలపల్లి గ్రామంలో సర్పంచ్, వై.శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ సభ జరిగింది.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన గ్రామసభలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఉప సర్పంచ్ కిలపర్తి భాస్కరరావు మాట్లాడారు. మండలంలోని ఏ.కొత్తపల్లిలో ఎంపీపీ బుల్లిలక్ష్మి, ఎం.అలమండలో మాజీ జెడ్పిటిసి పోతల పాత్రునాయుడు, కాశీపురంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, రైవాడలో చల్లా నానాజీ, ముసిడిపల్లిలో సోమిరెడ్డి గోవింద, బి.కింతాడలో కొమర బాబురావు ఆధ్వర్యాన గ్రామసభలు జరిగాయి.

అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం గ్రామ సభలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బి రాందాస్, రాజాన విజయ్, ఎంపీటీసీ ఎన్ నర్సింగరావు, పంచాయతీరాజ్ డిఇ వీరభద్రరావు, సర్పంచ్ పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయం : గంటా

ఆనందపురం: గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా గ్రామసభలు నిర్వహించి, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంభీరం పంచాయతీలో జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం పంచాయతీల నిధులను దారిమళ్లించి, నిధులు, విధులు, బాధ్యతలు లేకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఒక్కరోజునే అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు గ్రామసభలను నిర్వహించి, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పలుశాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, మజ్జి వెంకటరావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, వైస్ ఎంపిపి బోట్ట ధనలక్ష్మి రామకృ ష్ణ, బిఆర్‌బి నాయుడు, ఎంపిడిఒ అడపాలవరాజు, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎడిఎ బి.విజయప్రసాద్, డాక్టర్ గంగునాయుడు, వెటర్నరీ డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మండలంలోని ఆనందపురంలో సర్పంచ్ చందకలక్ష్మి, వేములవలసలో సర్పంచ్ లంక కొండమ్మ, చందకలో సర్పంచ్ బంక శ్రీను, గొట్టుపల్లిలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, బిపి కల్లాలులో సర్పంచ్ కోన పైడిరాజు శ్రీను, వెల్లంకిలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, లోడగలవానిపాలెంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి, గండిగుండంలో సర్పంచ్ గన్‌రెడ్డి శ్రీనివాసరావు, శొంఠ్యాలో లంక లావణ్యారాంబాబు, కనమానంలో సర్పంచ్ ఆబోతు అప్పల రాము ఆధ్వర్యంలో జరిగాయి.

పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్ పురం, పెదగాడి, గోరపల్లి, సరిపల్లి, జెర్రుపోతుల పాలెం, చింతగట్ల, రాంపురం, గవరపాలెం,పినగాడి, జుత్తాడ గుర్రంపాలెం ముదపాక, రాజయ్యపేట గ్రామాలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఎస్ఆర్ పురంలో ఎంపిపి మదిపాడు నాగమణి పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన, ఎంపిటిసిలు పాల్గొనగా, గ్రామసభలు జరిగాయి. మండలకేంద్రంలోని గ్రామసభలో ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ ఎ.విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి, గ్రామసభల్లో తీర్మానాలు చేశారు.

భీమునిపట్నం : మండలంలోని 16 పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై చర్చించి, సెప్టెంబర్ నుంచి మార్చి వరకు చేపట్టనున్న ఉపాధి పనుల వివరాలను వెల్లడించారు. మండలంలోని తాటితూరు, దాకమర్రి గ్రామసభల్లో ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీసుభాషిణి

భవన నిర్మాణ పనులను పూర్తి చేయండి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో నిర్మాణం చేపడుతున్న సబ్ ట్రెజరీ నిర్మాణ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిఏటిఓ లక్ష్మీ సుభాషిని తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలో సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం నూతన సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని పరిశీలించారు. 75 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భవనం పనుల వివరాలను డిప్యూటీ ఇంజనీర్ ప్రసాదును అడిగి తెలుసుకున్నారు. భవనంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని, వృద్ధులకు, ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యాలయానికి స్ట్రాంగ్ రూము, పోలీసులకు రెస్ట్ రూము కల్పించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నర్సీపట్నం, కోటవురట్ల మండలాలలో నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఆమెతో పాటు స్థానిక సబ్ ట్రెజరర్ అధికారి రామారావు ఉన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు .ఆలయ అర్చకులు మహేష్ పూజలు చేసి , తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొప్పిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు .

నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో కామాక్షమ్మ ఆలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని ఏకాహం భజన కార్యక్రమం నిర్వహించారు.శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన భజన శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏకాహం కార్యక్రమంలో శ్రీనివాసా భజన సమాజం, మహిళ భజన సమాజం సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి .

హోం మంత్రి అనితకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో శుక్రవారం జరిగిన గ్రామసభలో పాల్గొన్న హెూం మంత్రి వంగలపూడి అనితకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సమస్యలపై వినతులు అందజేశారు.పింఛన్లు ,గృహాలు మంజూరు చేయాలని, వ్యక్తిగత సమస్యల పై వినతి పత్రాలు అందజేశారు. వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి యోగ టీచర్ దవరసింగి రాంబాబు రాష్ట్రంలో ఆయుష్ విభాగంలో 2022 నుంచి పనిచేస్తున్న యోగా టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆల్ ఇండియా భవానీదీక్షా ఛారిటబుల్ ట్రస్ట్ తరపున విజయవాడ దుర్గాదేవి ఆలయం పాలక మండలిలో ఒకరికి చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు .

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన భారీ ర్యాలీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:విద్యార్థినిలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సీపట్నంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా అబీద్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం నర్సీపట్నంలో విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న అల్లరి మూకలను అరికట్టాలని, బస్టాండ్, శివపురం, కళాశాలలు, పాఠశాలలు సంక్షేమ హాస్టల్స్ వద్ద పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ మాట్లాడుతూ, కలకత్తా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం, కోటవురట్ల మండలం పాములవాకలో బాలికపై అత్యాచారం వంటి ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని వెంటనే అరికట్టేందుకు ప్రభుత్వాలు ఫోక్సో, నిర్భయ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి కళాశాల, పాఠశాలలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి , రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు జనార్దన్, స్వామి, రవి, భూషణ్, గణేశ్, సాయి, దుర్గా, శివ మణికంఠ జయకృష్ణ, మోహన్, మహేష్, డివైఎఫ్ఐ డివిజన్ నాయకులు గౌతమ్, ఐద్వా నాయకులు గౌరీ, ప్రసన్న, కెవిపిఎస్ నాయకులు చిరంజీవి, సిఐటియు జిల్లా నాయకులు అడిగర్ల రాజు, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరహాలు, దుర్గా, స్వామి, రవి, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆర్‌టిసి స్థలాన్ని పరిశీలిస్తున్న అయ్యన్న

ఆర్‌టిసి స్థలాన్ని లీజుకు ఇవ్వం

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఆర్టీసి స్థలాన్ని లీజుకు ఇచ్చే ప్రసక్తే లేదని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. లీజు పొందిన వ్యక్తి ఆర్‌టిసి స్థలంలో మట్టిని వేయడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, అయ్యన్నపాత్రుడు తనయుడు చింతకాయల రాజేష్ డిపో మేనేజర్‌ను కలిసి వివరణ కోరారు. లీజుదారుడికి ఎటువంటి ఎన్‌ఓసి ఇవ్వలేదని, మట్టిని వేయడానికి అనుమతులు కూడా ఇవ్వలేదని డిపో మేనేజర్ ధీరజ్ వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు అక్కడకు చేరుకుని స్థలంలో కాంట్రాక్టర్ డంపింగ్ చేసిన మట్టిని పరిశీలించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రైతుల్ని ఒప్పించి అప్పట్లో ఆర్టీసీకి స్థలం సేకరించామని, దీనిని వీలైనంత వరకు ఆర్టీసీకే వినియోగించాలని సూచించారు. భవిష్యత్ అవసరాల కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు.దీనిపై గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు వద్ద ప్రస్తావించానన్నారు. ఈ విషయం తెలిసినా ప్రైవేటు వ్యక్తులు మట్టిని వేసినా డిపో మేనేజర్ ఎందుకు ప్రశ్నించలేదని తెలిపారు.మట్టిని వేసిన వారిపై చర్యలు చేపట్టాలని డీఎంకు ఆదేశించారు.

గుర్తింపు లేని హాస్టళ్లను మూసివేయాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని హాస్టళ్లను తక్షణమే మూసివేయాలని కోరుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విభాగాల సంఘం (ఎస్ఈబిఎస్ఎ) రాష్ట్ర అధ్యక్షులు కె. శివనారాయణరాజు కోరారు. శుక్రవారం నర్సీ పట్నం ఆర్డీవో హెచ్‌వి. జయరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శివనారాయణరాజు మాట్లాడుతూ, అనధికార వసతి గృహాలపై విజిలెన్స్ అధికారుల నిఘా అవసరమన్నారు. అనధికారికంగా నిర్వహిస్తున్న హాస్టళ్లపై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న శివనారాయణరాజు

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఇస్కాన్ సాగర్ నగర్ మందిర ప్రాంగణంలో ఈ నెల 24, 25, 26, 27 తేదీలలో నాలుగు రోజులపాటు ఘనంగా జరుగనున్నాయని సంస్థ అధ్యక్షుడు సాంబదాస్ తెలిపారు. శుక్ర వారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా శ్రీ రాధాకృష్ణుల అలంకరణ నిలుస్తుందని, వస్త్రాలను, ఆభరణాలను ఉత్తరప్రదేశ్‌లోని బృందావనం నుంచి సమకూర్చామని అన్నారు. ప్రత్యేక పుష్పాలంకరణ కోసం పుష్పాలను బెంగళూరు నుండి తెప్పించామన్నారు. కార్యక్రమంలో ఫెస్టివల్ కో- ఆర్డినేటర్ మాతాజీ నితాయి సేవిని, ఇస్కాన్ ప్రతినిధులు ఎంవి.రాజశేఖర్, గౌర్ దాసు, వంశీకృష్ణ ప్రభు పాల్గొన్నారు.

గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జగన్

పోర్టు సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 28 నుంచి పోర్టులో జరగనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పోర్టు టిఎం ఆఫీస్ వద్ద సిహెచ్‌డి మూడు షిఫ్టుల్లో గేటు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు, డాక్ కార్మికులకు షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, మూడు సంవత్సరాల బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పోర్టు హాస్పిటల్, ఆస్తులను అమ్మరాదని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గేటు సమావేశాలలో సిఐటియు అనుబంధ ఫెడరేషన్ ఆల్ ఇండియా కార్యదర్శి బి.జగన్, పలు సంఘాల నాయకులు బిసిహెచ్.మసేన్, సత్యరాజ్, కె.మంగయ్యనాయుడు, కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, వురుకూటి రామ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

'కలుషిత ఆహారం' ఘటనలో ..

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత

ప్రజాశక్తి-పాడేరు:ఈ నెల 17వ తేదీన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథ ఆశ్రమంలో ఫుడ్ పోయిజినింగ్‌తో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.పది లక్షలు చొప్పున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎక్స్-గ్రేషియో గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబీకులకు రూ.పది లక్షల చొప్పున రూ.30 లక్షల చెక్కులను కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఒక్కొక్క విద్యార్థి వైద్య ఖర్చులకు రూ.50 వేల చొప్పున చెక్కులను అందించారు. అదేవిధంగా స్వల్ప అస్వస్థతకు గురైన మిగిలిన విద్యార్థులకు రూ. ఐదు వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సంతలలో అమ్ముతున్న నకిలీ సరుకులు కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వసతి గృహాలలో మాత్రమే చేరాలని సూచించారు. అనుమతి లేని ప్రైవేటు వసతి గృహాల్లో చేర్పవద్దన్నారు. పిఒ అభిషేక్, డిఆర్‌ఓ బి.పద్మావతి పాల్గొన్నారు.

అభినందనలు తెలియజేస్తున్న టిడిపి నేతలు

సిఐ కుమారస్వామికి అభినందనలు

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి సిఐ కుమారస్వామికు ఎలివేషన్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సీఐగా కుమారస్వామి ఇటీవల బాధ్యతలు చేపట్టారు.ఈ మేరకు టిడిపి శ్రేణులు సిఐను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.సిఐను కలిసిన వారిలో టిడిపి నాయకులు కురందాసు నూకరాజు, కళ్ళ శ్రీనివాస్, కక్కిరాల సురేష్, తాతారావు తదితరులు పాల్గొన్నారు,

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పిఒ

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని సంతారి పెదగరువులో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐటీడీఏ పీవో అభిషేక్ పర్యటించారు. ప్రభుత్వం సరఫరా చేసిన టీవీలను పర్నిచర్లను పరిశీలించారు. మెనూ అమలుపై తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:కైలాసపట్నం అనాధా శ్రమంలో కలుషిత ఆహారం బారిన పడి గడిచిన ఆరు రోజులుగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చికిత్స పొందుతున్న ఐదుగురు విద్యార్థులను శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానకమ్మ బాధితులకు నిత్యావసర వస్తువులు, న్యూట్రీషియన్ కిట్ అందజేశారు. అనంతరం వారిని వారి స్వగృహాలకు చేర్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఊర్ధవరావు, వైద్య సిబ్బంది, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:పశువులకు గాలి కుంటు నివారణకు చర్యలు చేపడుతున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రిఅప్పడు తెలిపారు. 8 నెలలు దాటిన పశువులకు వ్యాధి సోకకుండా టీకాను వేయించుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరమైనదని, వ్యాధి సోకిన పశువులకు నోటిలో కాళ్ల మధ్య పుల్లు ఏర్పడి మేత మేక పోవడంతో నీరసించి పోతాయన్నారు. పాడి పశువుల్లో పాలు దిగుబడి తగ్గిపోవడంతో పాటు వ్యాధి తీవ్రత ఎక్కువైతే మరణించే అవకాశం ఉంటుందని తెలిపారు. టీకాలు వేయిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి